రైల్వే అండర్ పాస్ కష్టాలు తీరేనా !

- అధ్వానంగా రహదారులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర వాసులకు అండర్ పాస్ కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో రైల్వే అండర్ పాస్ రోడ్డు నిర్మించటానికి రైల్వే అధికారులు అంగీకరించటం లేదు. దీంతో ఇక్కడ రహదారి గోతులు పడి ప్రమాదకరంగా మారింది. అలాగే అయోధ్యనగర్ నుంచి సుబ్బరాజు నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట వెళ్లే మార్గంలోని అండర్ పాస్ కూడా రైల్వే అధికారుల తీరుతో ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


దేవీనగర్‌లో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి

గోతుల మయం..

అండర్ పాస్‌ల వద్ద చిన్న పాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. మట్టి గ్రావెల్ రోడ్డు కావటంతో కొద్దిపాటి వర్షాలకే ఈ ప్రాంతం బురదగా మారి రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గోతులు వల్ల తరచూ వాహన చోదకులు గాయాల బారిన పడుతున్నారు. రహదరుల్లో కొద్దిపాటి నీరు నిల్వ ఉన్న వాహనాలు రోడ్డులో కూరుకుపోతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఎవరు చెప్పినా.. ఫలితం శూన్యం

అండర్ పాస్‌ల వద్ద రోడ్డు వేయకపోవటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయిని ప్రజలు


సుబ్బరాజునగర్, న్యూ ఆర్ఆర్‌పేటకు వెళ్లే రైల్వే అండర్ పాస్ రోడ్డు

అవస్థలు పడుతున్నారంటూ కార్పొరేటర్ జానారెడ్డి అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పలు మార్లు నగరపాలకసంస్థ కమిషనర్, రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ సమస్యలను స్వయంగా పరిశీలించిన అప్పటి మున్సిపల్ కమిషనర్ రైల్వే అధికారులతో మాట్లాడినప్పటికీ ఈ ప్రాంతాల్లో రోడ్డు వేసేందుకు రైల్వే అధికారులు అంగీకరించలేదు. దీంతో మల్లాది విష్ణు ఢిల్లీ వెళ్లి రైల్వే ఉన్నతాధికారులను సైతం కలిసి సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కానీ పనులు మాత్రం జరగలేదు.

ప్రమాదకరంగా రోడ్డు

రైల్వే అండర్ పాస్ వరకు విశాలంగా నున్నగా ఉన్న రోడ్డు అండర్ పాస్ వద్దకు వచ్చే సరికి కంకర తేలిపోయి ప్రమాదకరంగా మారింది. గోతులు, కంకర లేచిపోవటం వల్ల వాహనాలు తరచూ పాడవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ అండర్ పాస్‌ల వద్ద రోడ్డు వేసేందుకు రైల్వే అధికారులు అభ్యంతరం చెప్పడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం.. నరకం



రైల్వే అధికారుల తీరు వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. బసవతారకనగర్, సుబ్బరాజునగర్, న్యూ ఆర్ఆర్‌పేట తదితర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చేందుకు రైల్వే అండర్‌పాస్ దగ్గరి దారి కావటంతో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రాళ్లు తేలిపోయి వాహనాలు తరచూ పాడవుతున్నాయి. గర్భిణులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం నరకంగా ఉంది.

– అంగిరేకుల నాగేశ్వరరావు, స్థానికుడు, అయోధ్యనగర్

పెద్ద సంఖ్యలో రాకపోకలు



దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసులతో పాటు గుణదల, బుడమేరు మధ్య కట్ట తదితర ప్రాంతాలకు చెందిన వారు దేవీనగర్ రైల్వే అండర్‌పాస్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ రోడ్డు వేయటానికి రైల్వే అధికారులు అడ్డు పడుతున్నారు. దీంతో తరచూ పలు వాహనాలు ఇక్కడ మరమ్మతులకు గురవుతున్నాయి. స్కూలు, కళాశాలలకు వెళ్లేందుకు చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

– జి.వెంకటేశ్వరరావు, స్థానికుడు, దేవీనగర్

ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజక వర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): తెలుగు నాట ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకొని సెంట్రల్ నియోజకవర్గ ప్రజానీకానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత ఊర్లపై మమకారానికి, వ్యవసాయానికి, పెద్దలకు ఇచ్చే గౌరవానికి ప్రతీక సంక్రాంతి అన్నారు. భోగి మంటల వెలుగులు, రంగవల్లులు, వేకువజామునే తలంటు స్నానాలు, పిండి వంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, గాలిపటాల సందళ్లు, పండుగ తెచ్చే సంబరాలతో ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి పల్లె పాడిపంటలతో కళకళలాడుతూ.. రైతులు, గ్రామీణ వృత్తుల వారంతా సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి, సమాజ హితానికి ఈ సంక్రాంతి శుభకరం అయ్యేలా దీవించాలని మల్లాది విష్ణు ప్రార్థించారు.

ముగిసిన షాబుఖారి దర్గా ఉరుసు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవ కమిటీ చైర్మన్ అల్తాఫ్ రాజా అతిథులను ఆహ్వానించి ప్రార్థనలు జరిపారు. అనంతరం అన్నదానం చేశారు.

క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం పండుగ సెలవు దినం సందర్భంగా రద్దు చేశామని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర వాసులు గమనించాలని చంద్రశేఖర్ సూచించారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): 30వ డివిజన్ జీవీఆర్ నగర్‌లో డ్రెయినేజీ కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ పనులు నత్తనడకన సాగుతుండటంతో పాటు రోడ్డుపై మెటీరియల్ వదలివేయటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో బుధవారం 'నడిచేందుకు దారేదీ..' శీర్షికన కథనం ప్రచురించింది. కథనానికి స్పందించిన అధికారులు, కాంట్రాక్టర్ ఆదివారం పనులు ప్రారంభించారు. అలాగే రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన మెటీరియల్‌ను తొలగించారు. దీంతో స్పందించిన అధికారులు, కాంట్రాక్టర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంస్కృతిక కళా రంగాల అభివృద్ధికి కృషి



విజయవాడకల్చరల్: జిల్లాలో సాంస్కృతిక కళారంగాల అభివృద్ధికి కృషి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎంఎస్ నారాయణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమించిన ఎంఎస్ నారాయణను నగరానికి చెందిన కళాసంస్థలు గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ నారాయణ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని, కళారంగానికి చెందిన పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. సత్కార కార్యక్రమంలో బీవీ వీరభద్రరావు, డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, ప్రభల శ్రీనివాస్, ఎం జోషి, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం సాయి నామ పారాయణం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని లోక కల్యాణార్థం వైఎస్సార్ సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఆదివారం శ్రీసాయి నామ పారాయణం జరిగింది. శ్రీ సాయినక్షత్రమాలిక మండలి కన్వీనర్ తంగెళ్లమూడి వీరమోహనరావు, సభ్యులు సాయి గీతాలను ఆలపించారు. నాగేశ్వరరావు దంపతులు బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబావారిని దర్శించుకుని పారాయణం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాపీ పనులకు నగరానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దర్శి మండలం పెద్ద ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఆవులూరి చిన్నా తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాపీ పనులు నిమిత్తం విజయవాడ నగరానికి వచ్చాడు. పాత ప్రభుత్వాస్పత్రి రోడ్డులో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఈనెల 6వ తేదీ ఉదయం టీ తాగడానికి వెళ్తున్నానని తోటి వారికి చెప్పి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. అతనితో కలిసి పనిచేసేవారు. కుటుంబ సభ్యులు చిన్నా ఆచూకీ కోసం వెతికారు. అతని ఆచూకీ తెలియకపోవడంతో గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నా అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానందుడు చూపిన మార్గం ఆదర్శనీయం

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వామి వివేకానంద చూపిన మార్గం ఆదర్శనీయమని, యువత ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. బీసెంట్ రోడ్డులోని రాఘవయ్య పార్క్ వద్ద స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ.. భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వారిలో స్వామి వివేకానందుడు అగ్రగణ్యులని కొనియాడారు. మానవ సేవే మాధవ సేవయని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కీర్తించారు. భారతదేశాన్ని జాగృతం చేసిన వివేకానందుడు తన ఉపన్యాసాలతో దేశ సంస్కృతి సాంప్రదాయాలు, వేదాలు, యోగాను దేశ విదేశాలకు పరిచయం చేశారన్నారు. యువతను మేల్కొలిపి వారిని కార్యోన్ముఖుల్ని చేయటానికి ఆయన ఎంతగానో కృషి చేశారని చెప్పారు. యువశక్తి అణుశక్తి కంటే బలమైనదని చాటిన ఆయనను.. నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణంరాజు, వెన్నం రత్నారావు, చల్లా సుధాకర్, వడ్డీ వాసు, అంజిబాబు, కాళ్ల ఆదినారాయణ, దోనేపూడి శ్రీనివాస్, చాంద్ శర్మ, బంకా బాబీ, ఎంఎస్ నారాయణ, ప్రభల శ్రీనివాస్, కందగట్ల శ్రీనివాస్, ప్రేమ్, ప్రసాద్, అక్బర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విష్ణు, నాయకులు

రామ్మోహన గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామ్మోహన గ్రంథాలయంలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలో వివిధ కళాశాలల విద్యార్థులకు జాతీయ యువ విజేత అవార్డులను ప్రదానోత్సవం జరిగింది. రామ్మోహన గ్రంథాలయం, అటల్ బిహారీ వాజ్‌పేయ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి వికాస వాహిని ప్రతి రోజూ నిర్వహించే క్విజ్ పోటీల విజేతలు, గత నెలలో నిర్వహించిన కథా రచన పోటీ విజేతలు 60 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీపీ ఆర్టీయూ వ్యవస్థాపకుడు డి.శ్రీను, సిద్ధార్థ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శేషశ్రీ, డాక్టర్ లెనిన్ బాబు, విద్యార్థి వికాస వాహిని సంచాలకులు శ్రావణి, సంస్థ వ్యవస్థాపకుడు వేములపల్లి కేశవరావు, సభ్యులు చిదంబరేశ్వరరావు, అట్లూరి సుమ, గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


విజేత అవార్డులు ప్రదానం చేస్తున్న పట్టాభిరామయ్య తదితరులు

రాఘవయ్య పార్క్ వద్ద..

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రాఘవయ్య పార్క్ వద్ద ఆయన విగ్రహానికి వీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుమంజన సేవ జరిగింది. పెద్ద శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ప్రతిమను కొలువు దీర్చి రమేష్, జ్యోతి దంపతులు మంగళహారతి సమర్పించారు. అర్చకులు గోదా దేవిని పెండ్లి కూతురుగానూ..రంగనాథస్వామివారిని పెండ్లి కుమారునిగానూ చేసి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు గోదారంగనాథ స్వామివార్ల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణోత్సవం తరువాత వివాహం కాని వధూవరులకు కల్యాణ మాల అందజేస్తామని పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్య శ్రీహరి తెలిపారు.

పారాయణం.. పుణ్యప్రదం

విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం పుణ్యప్రదమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం ధనుర్మాసోత్సవాల్లో ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. సృష్టికి మూలం పరమాత్మ స్వరూపమేనని, అలాంటి పరమాత్మను మనసా వాచా కర్మనా త్రికరణ శుద్ధిగా పూజించాలన్నారు.


విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, భక్తులు


తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భక్తులతో కలిసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణిమూర్తి, కొప్పరపు మారుతీ, యల్లాప్రగడ సుధీర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏషియన్ యోగా పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న సత్యప్రసాద్‌రాజు



ప్రశంసా పత్రం అందుకుంటున్న పూజిత

విజయవాడస్పోర్ట్స్: ఏషియన్ యోగా చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబర్చి పతకాలను కైవసం చేసుకున్నారు. సింగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన పోటీలకు నగరానికి చెందిన ధీరజ్ శ్రీకృష్ణ, సత్యప్రసాద్‌రాజు, ఎం.పూజితలు భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ధీరజ్‌శ్రీకృష్ణ జూనియర్ సోలో విభాగంలో గోల్డ్, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో సిల్వర్, ట్రెడిషనల్ విభాగంలో సిల్వర్, రిథమిక్ పెయిర్ విభాగంలో బ్రాంజ్, సత్యప్రసాద్‌రాజు 18 ఏళ్ల పైబడిన రిథమిక్ పెయిర్ విభాగంలో గోల్డ్, ట్రెడిషనల్ విభాగంలో సిల్వర్, ఆర్టిస్టిక్ సోలో విభాగంలో సిల్వర్, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో నాల్గో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదే విధంగా పూజిత 30 ఏళ్ల పైబడిన ట్రెడిషనల్ విభాగంలో నాల్గో స్థానాన్ని సాధించింది. 12 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ ఆసియా క్రీడల్లో సత్తా చాటి విజయవాడ నగరంతో పాటు రాష్ట్ర ఖ్యాతిని చాటిన క్రీడాకారులను కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రవి, ఉపాధ్యక్షులు రామలింగరాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి ఎల్.శాంతి అభినందించారు.


ధీరజ్‌శ్రీకృష్ణ

వేమూరి కథలు వాస్తవ జీవిత దర్పణాలు



విజయవాడకల్చరల్: వేమూరి సత్యనారాయణ కథలు వాస్తవ జీవిత దర్పణాలని కవి బండ్ల మాధవరావు అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా పాఠశాలలో కథకుడు, సినీ చిత్ర నిర్మాత రచించిన ఎనభైలో ఇరవై కథా సంపుటి పరచయ సభను ఆదివారం నిర్వహించారు. మాధవరావు మాట్లాడుతూ.. సమాజ చిత్రీకరణ చేయడంలో కథకుడు సత్యనారాయణ అందవేసిన చెయ్యి అని అభివర్ణించారు. సాహితీవేత్త నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ.. సత్యం కథలో కథ, ముగింపు ప్రత్యేకత కలిగి ఉంటుందన్నారు. గ్రంథ రచయిత వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. నా చుట్టూ ఉన్న జీవితాలే కథకు వస్తువులన్నారు. అవి వాస్తవ వ్యక్తులేకాని కల్పిత పాత్రలు కావన్నారు. సాహితీవేత్త తుమ్మల గోపాలరావు సత్యం సాహిత్య విశేషాలను వివరించారు. సాహితీ మిత్రులు నిర్వాహకుడు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, అనిల్ డ్యానీ, తోటకూర రఘు, అంజని యలమంచలి, పుష్పాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్రాంతి సంబరాలు అంబాపురంలో ఆదివారం అంబరాన్నంటాయి. పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాలలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంస్కృతి, సంప్రదాయాలకు మన పండుగలు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు మల్లాది విష్ణు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాయి, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, నిర్వాహకులు

మేడపై నుంచి పడి వివాహిత మృతి

మధురవాడ(విశాఖజిల్లా): పండగ వేళ ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. మేడపై నుంచి వివాహిత కింద పడి మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పీఎంపాలెం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. విజయవాడ సత్యనారాయణపురంలోని ఓగిరాల వీధికి చెందిన కొంజేటి వేణుగోపాల కృష్ణమూర్తి, భార్య సుధ పండగ నేపథ్యంలో విశాఖలోని మధురవాడ ఐటీ సెజ్ సమీపంలో వుడా హరిత అపార్ట్‌మెంట్ నివాసముంటున్న పెద్ద కుమారుడు వెంకట్ సాయిసందీప్ ఇంటికి శుక్రవారం వచ్చారు. సందీప్ గీతం వైద్య కళాశాలలో ఎనస్తీషియన్‌గా పని చేస్తున్నాడు. సుధకు బీపీ, థైరాయిడ్, షుగర్‌తో పాటు మోకాలి నొప్పులు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తన భార్యకు ఇన్సులిన్ ఇవ్వాలని వెతకగా.. ఇంట్లో కనిపించలేదు. బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో సుధ కనిపించింది. ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. అప్పటికే సుధ మృతి చెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ పైకి వెళ్లగా కళ్లు తిరిగి పడిపోయి ఉంటుందని, ఆమె మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని కృష్ణమూర్తి ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.





ముగిసిన పుస్తక మహోత్సవం

నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. 12 రోజుల పాటు పుస్తక ప్రేమికులతో స్టేడియం ప్రాంగణంలో సందడి నెలకొంది. అనేక పుస్తకాలతో కూడిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూఢ నమ్మకాలు వీడాలంటూ ప్రదర్శనలు చేస్తూ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. పిన్న, పెద్ద పుస్తకాలను ఆసక్తిగా చూసి కొనుగోలు చేసి పాఠకాభిమానాన్ని చూపారు. అనేక పుస్తకాల ఆవిష్కరణలకు వేదికగా మారింది పుస్తక మహోత్సవం. పుస్తకానికి ఆదరణ తగ్గలేదని ఈ మహోత్సవం నిరూపించిందని నిర్వాహకులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





దివ్యాంగునికి బడ్డీ కొట్టు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం దివ్యాంగునికి బడ్డీ కొట్టు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, కోరంగి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. ఇటీవల బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన దివ్యాంగుడు బాలు తనకు జీవనోపాధి కోసం బడ్డీ కొట్టు ఇవ్వాలని కోరాడన్నారు. దీంతో తాము సభ్యులు, దాతల సహకారంతో బడ్డీను అందజేశామని తెలిపారు. అనంతరం బడ్డీను డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్ట్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బచ్చు వినీత, జలీల్ తదితరులు పాల్గొన్నారు.